అరకొరగా పాఠ్య పుస్తకాలు

- ప్రతిపాదనల్లో సగం కూడా రాని వైనం
- అందరికీ ఇవ్వడం కష్టమే

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం బడుల్లో విద్యార్థులకు అందివ్వాల్సిన పాఠ్య పుస్తకాలను పూర్తి స్థాయిలో అందిస్తామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధికారులు ప్రతిపాదించిన పాఠ్యపుస్తకాల్లో సగం కూడా రాలేదు. అరకొరగా పాఠ్యపుస్తకాలు రావడంతో బడులు ప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు ఇవ్వడం కష్టంగానే కనిపిస్తోంది...

మరో 15 రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. మొదటి రోజే విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలిస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 27 టైటిల్స్‌కు సంబంధించి 46,98,726 పాఠ్య పుస్తకాలు అవసరమని జిల్లా విద్యా శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించగా జిల్లాకు ఇప్పటి వరకు 5,40,752 పాఠ్య పుస్తకాలు మాత్రమే అందాయి. ఇందులో 8, 9, 10వ తరగతికి చెందిన పాఠ్య పుస్తకాలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేరుగా ఆయా ఎంఈవో లకు చేరనున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 4,66,836 మంది విద్యార్థులు ఉన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగ తికి సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నాయి. 2023-24 విద్యా సంవత్సరానికి 1 నుంచి పది వరకు ఉన్న తరగతులకు స్పెల్-1 కింద 38,18,504, స్పెల్- 2 కింద 13,53,517 పాఠ్య పుస్తకాలు అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ ఏడాది మాత్రం 46,98,726 పాఠ్య పుస్తకాలు అవసరమని నివేదిక ఇచ్చారు. గతేడాదికి ఈ ఏడాదికి తేడా చూస్తే 4,73,298 పాఠ్య పుస్తకాలు ప్రతిపాదనల్లోనే తగ్గాయి. విద్యార్థులకు అవసరమైన స్థాయిలో పుస్తకాలు రాకపోవడం వల్ల పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులందరికీ అన్ని సబ్జెక్టుల పుస్తకాలు అందడం అనుమానంగానే ఉంది. ఉదాహరణకు ఆరో తరగతికి సంబంధించి సాంఘిక శాస్త్రం పుస్తకాలే వచ్చాయి. ఏడో తరగతికి హిందీ, తెలుగు పాఠ్య పుస్తకాలు వచ్చాయి. ఎనిమిదో తరగతికి ఇంగ్లీషు, జీవశాస్త్రం, హిందీ, సాంఘిక శాస్త్రం (ఆంగ్ల, తెలుగు మాధ్యమాలు), గణితం (ఉర్దూ మీడియం) తదితర పుస్తకాలు ఎంఈవోలకు చేరాయి. తొమ్మిదో తరగతికి జీవశాస్త్రం మాత్రమే వచ్చింది. 10వ తరగతికి చెందిన అన్ని సబ్జెక్టులకు వచ్చినప్పటికి అరకొరగా సరఫరా అయ్యాయి.

ప్రయివేటులో బెంగ..

ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇలా ఉంటే.. ఈ సారి ప్రైవేట్ విద్యార్థులకూ పాఠ్య పుస్తకాల బెంగ పట్టుకుంది. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలనే ప్రైవేట్ స్కూళ్లలో అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. కానీ.. ప్రైవేట్ విద్యా సంస్థలు దీనికి ఒప్పుకోలేదు. తాము తయారు చేసిన సిలబస్ అమలు చేస్తామనే మంకుపట్టుతో ఉన్నారు. మరోపక్క.. జిల్లాలోని పలు పట్టణాల్లోని దుకాణాల్లో ప్రభుత్వ పుస్తకాలను అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం ఇంత వరకు చేరవేయకపోవడంతో ప్రైవేట్ విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఏదేమైనా ఈ విద్యా సంవత్సరం తొలి నెల రోజుల వరకు విద్యార్థులకు చదువు కష్టాలు తప్పేలా లేవు.



పుస్తకాలు అందేలా చర్యలు



ఇప్పటి వరకూ 60 శాతం పాఠ్య పుస్తకాలు వరకూ వచ్చాయి. ఇంకా వస్తున్నాయి. వస్తున్నవి వచ్చినట్లు ఎంఆర్‌సిలకు పంపుతున్నాం. ఈ ఏడాది పాఠశాలల ప్రారంభం సమయానికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

- శామ్యూల్, జిల్లా విద్యాశాఖాధికారి.

అందరికీ పుస్తకాలు అందించాలి



పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలి. గతేడాది కొన్ని సబ్జెక్టుల పుస్తకాలు విద్యార్థులకు అందలేదు. ఈ ఏడాది ఆ పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలి.

- షేక్ అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

పేద, బడుగు వర్గాల సేవలో తపాలా శాఖ

- చిన్న పిల్లల మొదలు వృద్ధుల వరకూ సేవలు- ప్రజాశక్తితో పోస్టల్ సూపరింటెండెంట్ జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

'తపాలా శాఖ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కూడా తమ సేవలను నాటి నుండి నేటి వరకు అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతూ ఉంది. ఉత్తరాల బట్వాడా, మనీ ఆర్డర్, సేవింగ్స్ రికరింగ్ డిపాజిట్ల నుండి నేడు చిన్నపిల్లలు మొదలుకొని వయోవృద్ధుల వరకు భారత ప్రభుత్వం ద్వారా తపాలా శాఖ అనేక పథకాలను రూపొందించి సకాలంలో క్లైమ్‌లు చెల్లించి ప్రజల మన్ననలను పొందింది అనడంలో ఎలాంటి సందేహం లేదు." అని కర్నూలు ప్రధాన కేంద్ర తపాలా కార్యాలయం సూపరింటెండెంట్ జి.జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ప్రజాశక్తితో ముఖాముఖిగా మాట్లాడారు..

విద్యాభ్యాసం ఎక్కడ చేశారు? ఉద్యోగ ప్రస్థానం ఎలా సాగింది?

పిఎస్ : అనంతపురం జిల్లాలో బిఎస్సి కంప్యూటర్ సైన్స్ చదివాను. 2003లో పోస్టల్ అసిస్టెంట్‌గా క్లరికల్ జాబ్ లో చేరాను. 2014 నుండి 2018 వరకు కదిరిలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశాను. 2018 లో కర్నూలు ఐపిబిఎంగా, నందికొట్కూరు ఐపిఎస్‌పిగా పనిచేసి, 2022లో సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై గోవాలోని అంజిలో పనిచేసేందుకు వెళ్లాను. అక్కడినుండి ఈ నెల 9న కర్నూలు సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చి చేరాను.

కర్నూలు డివిజన్లో ఎన్ని పోస్టాఫీస్‌లు ఉన్నాయి? ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారు?

పిఎస్ : కర్నూలు డివిజన్‌లో 434 పోస్ట్ ఆఫీస్‌లు ఉన్నాయి. అందులో 372 గ్రామీణ, 60 సబ్ పోస్ట్ ఆఫీస్‌లు ఉన్నాయి వాటిలో 1,102 మంది తపాలా సిబ్బంది పనిచేస్తున్నారు.

ప్రజలకు తపాలా సేవలు ఎలా అందిస్తున్నారు?

పిఎస్ : తంతి, తపాలా కార్యాలయాల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు మంచి సేవలు అందిస్తూ వారి సొమ్ముకు భద్రతకు మారుపేరుగా నిలిచాం. గతంలో తంతి, తపాలా కార్యాలయం ద్వారా ఉత్తరాల బట్వాడా, పొదుపు పథకాల ద్వారా సేవలు అందించే వారం. ప్రస్తుతం టెక్నాలజీని ఉపయోగించుకుని స్పీడ్ పోస్ట్ ద్వారా సత్వర బట్వాడా చేస్తున్నాం.

పోస్టల్ ద్వారా ప్రజలకు పొదుపు చేసుకునేందుకు ఏలాంటి అవకాశాలు ఉన్నాయి. వడ్డీ రేటు ఎంత?

పిఎస్ : పోస్టల్ శాఖ ద్వారా 11 రకాల సేవింగ్స్ చేసుకునేందుకు అవకాశం ఉంది. వాటి వడ్డీ రేట్లు ఇలా ఉన్నాయి. సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీం ఐదేళ్లకు 8.2 శాతం, సుకన్య సమృద్ధి యోజన అకౌంట్ 21 ఏళ్లకు 8.2 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ ఐదేళ్లకు 7.7 శాతం, టైం డిపాజిట్ ఐదేళ్లకు 7.5 శాతం, మహిళా సన్మాన సేవింగ్ సర్టిఫికెట్స్ రెండేళ్లకు 7.5 శాతం, మంత్లీ ఇన్కమ్ స్కీమ్ ఐదేళ్లకు 7.5 శాతం, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ 15 ఏళ్లకు 7.1 శాతం, టైం డిపాజిట్ రెండేళ్లకు ఏడు శాతం, టైం డిపాజిట్ ఒక ఏడాదికి 6.9 శాతం, రికరింగ్ డిపాజిట్ ఐదేళ్లకు 6.7 శాతం, సేవింగ్స్ అకౌంట్‌కు నాలుగు శాతం వడ్డీ చొప్పున ఖాతాదారులకు ఇస్తున్నాం.



మహిళలకు ప్రత్యేకంగా ఏమైనా పథకం ప్రారంభించారా?

పిఎస్ : కొత్తగా భారత ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా 2023లో మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్లు ప్రారంభించాం. మహిళలు , ఆడపిల్లలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పొదుపు పథకం.

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం ప్రయోజనాలేమిటి?

పిఎస్ : 18 యేళ్ల నిండిన మహిళలు, మైనర్ ఆడపిల్లల పేరు మీద సంరక్షకులు ఈ ఖాతాను ప్రారంభించవచ్చు. కనిష్టంగా వెయ్యి రూపాయలతో మరియు గరిష్టంగా రూ.రెండు లక్షల వరకు ఖాతాను తెరవచ్చు. గరిష్ట పరిమితితో రెండు లక్షల లోపు ఎన్ని ఖాతాలైనా తెరవచ్చు. ముందు ఉన్న ఖాతాకు మరో ఖాతా తెరవడానికి మధ్య మూడు నెలల వ్యవధి ఉండాలి. ఖాతా కాల వ్యవధి రెండు సంవత్సరాలు. అత్యధికంగా 7.5 శాతం వడ్డీ రేటు లభిస్తుంది. త్రైమాసిక ప్రాతిపదికన కలిపి ఖాతాలో జమ చేయబడుతుంది. ఈ కొత్త పథకం 2025 మార్చి 31 వరకు అందుబాటులో ఉంటుంది. జమ అయిన మొత్తంలో ఒక సంవత్సరం తర్వాత 40 శాతం వరకు పాక్షికంగా ఉపసంహరణ చేసుకునే సౌకర్యం కలదు. ఖాతాదారునికి ప్రాణాంతక వ్యాధులతో అనారోగ్యం ఏర్పడినప్పుడు వైద్య సహాయం కోసం లేదా సంరక్షకుని మరణం వంటి తీవ్ర కారణాలలో ఖాతాను అకాల మూసివేతకు అనుమతించబడును. ఈ కారణాల వల్ల ఖాతా ముందుగానే మూసి వేయబడితే అసలు మొత్తం వడ్డీతో సహా పథకానికి వర్తించే రేటు ప్రకారం చెల్లించబడుతుంది.

తపాల శాఖ ద్వారా బీమా పథకాలు ఏమైనా ఉన్నాయా?

పిఎస్ : తపాలా శాఖ టాటా, ఏఐజి, బజాజ్ అలా ఎంజ్ ఇన్సూరెన్స్ సంస్థల సౌజన్యంతో పేద, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉండే విధంగా గ్రూప్ యాక్సిడెంట్ పాలసీలను కేవలం ఒక ఏడాదికి రూ.520 చెల్లించి 15 రోజుల తర్వాత ఎలాంటి ప్రమాదం జరిగినా రూ.10 లక్షల బీమా కవరేజీ వర్తిస్తుంది. ఈ పాలసీ పొందేందుకు 18 యేళ్ల నుండి 65 యేళ్ల మధ్య వయసు గల వారు మాత్రమే అర్హులు. ఇప్పటికే కర్నూలు డివిజన్‌లో లక్షలాదిమంది ఈ పాలసీని తీసుకున్నారు. ప్రమాదం పొందిన దీర్ఘకాలికపక్ష వాతం ఉన్న వారికి ఈ బీమా వర్తిస్తుంది. మరిన్ని వివరాల కోసం తమ సమీపంలోని తపాలా శాఖ కార్యాలయంలో సంప్రదించాలి. క్లైమ్‌ల కోసం 1800 2667780, 1800229986 నెంబర్లకు సంప్రదించాలి.



కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు : ఆర్ఒ మౌర్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పాణ్యం నియోజకవర్గంలో సాధారణ ఎన్నికల కౌంటింగ్ కోసం ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేస్తున్నామని పాణ్యం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ కోసం రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ బ్లాక్ మొదటి అంతస్తులోని 112 నెంబర్ కౌంటింగ్ హాలులో పోస్టల్ బ్యాలెట్స్‌ను, 108, 109 నెంబర్ కౌంటింగ్ హాలులలో అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్, 103, 104 నెంబర్ కౌంటింగ్ హాలులలో పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌లను సిసి కెమెరాలతో పర్యవేక్షణ చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. కౌంటింగ్ హాల్‌లో కౌంటింగ్ నిర్వహణకు 14 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 26 రౌండ్లతో పూర్తి అవుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాలలోనికి సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని, సెల్ ఫోన్స్‌ను ఏర్పాటు చేసిన కౌంటర్లలోని భద్రపరచుకోవచ్చని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు రాజకీయ పార్టీల నాయకులు, కౌంటింగు ఏజెంట్లు పాటించాలన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న చీఫ్ కోచ్‌భూపతిరావు

తైక్వాండో చిన్నారులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతి రావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రామాంజనేయులుతో కలిసి తైక్వాండో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు తైక్వాండో సాధన చేసి రాణించాలని వారు కోరారు. ఈ వేసవి సెలవుల్లో సెల్ ఫోన్లకు దూరంగా ఉండి, శారీరక శ్రమగల క్రీడలను అభ్యసించాలని వారు కోరారు. పెద్ద మార్కెట్ కింగ్ పార్క్‌లో, కొండారెడ్డి బురుజు పార్క్‌లో మొత్తం రెండు శిక్షణ కేంద్రాలు ఉన్నాయని, ఉదయం 6 నుండి 8 వరకు శిక్షణ జరుగుతుందని తెలిపారు. 9849971256 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సిమ్మింగ్ ఇన్చార్జ్ శివప్రసాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రంలోకి ఫోన్లు అనుమతించం

- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జూన్ 4న రాయలసీమ యూనివర్సిటీలో జరిగే కౌంటింగ్‌కు మొబైల్ ఫోన్ అనుమతించేది లేదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని కౌంటింగ్ రోజున చేయాల్సిన పార్కింగ్, మొబైల్ డిపాజిట్ సెంటర్, ఫుడ్ కౌంటర్ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఈవిఎమ్ యంత్రాలను భద్రపరచిన లైఫ్ సైన్స్ బ్లాక్ ను, కౌంటింగ్ హాల్‌ను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున రాయలసీమ యూనివర్సిటీ మెయిన్ ఎంట్రెన్స్ గేట్ నుండి వెళ్ళే వాహనాల వివరాలను మెయిన్ ఎంట్రెన్స్ గేట్ వద్ద ఉండే సెక్యూరిటీ సిబ్బందికి అందచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మెయిన్ ఎంట్రెన్స్ గేట్ నుండి ఎంట్రీ అయ్యే అధికారిక వాహనాల పార్కింగ్‌కి, బాయ్స్ హాస్టల్ ఎంట్రెన్స్ గేట్ నుండి ఎంట్రీ అయ్యే వాహనాల పార్కింగ్‌కి వేరువేరుగా బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి ఎస్ఈని ఆదేశించారు. రిసెప్షన్ కౌంటర్‌లో ఏ విధంగా అయితే టేబుల్స్ ఏర్పాటు చేశారో అదే విధంగా ప్రతి నియోజకవర్గానికి 1000 స్కేర్ ఫీట్ తగ్గకుండా 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు 8 మొబైల్ డిపాజిట్ సెంటర్‌లను కౌంటింగ్ సిబ్బందికి, కౌంటింగ్ ఏజెంట్‌లకు వేరు వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. ఇంజనీరింగ్, లైఫ్ సైన్స్, లైబ్రరీ బ్లాక్‌ల పక్కన మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని టిడ్కో ఎస్ఈ ని కలెక్టర్ ఆదేశించారు. డేటా సెంటర్ వెనుక ఫుడ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, ఏజెంట్‌లకు వేరువేరుగా కంపార్ట్మెంట్‌లు ఏర్పాటు చేయాలని ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది కంపార్ట్మెంట్‌లో 10 కౌంటర్‌లు, ఏజెంట్ కంపార్ట్మెంట్‌లో 6 కౌంటర్ లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని డ్వామా పిడి ని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగబాబు, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్ రావు, ఆర్అండ్‌బి ఎస్ఈ నాగరాజు, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.



ఇవిఎంలను భద్రపరిచిన ఆర్‌యు సైన్‌బ్లాక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన , ఎస్‌పి

ఉచిత వ్యక్తిత్వ వికాస వక్త శిక్షణకు ఆహ్వానం

ప్రజాశక్తి-మద్దికేర

స్టూడెంట్స్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ పేరెంట్స్ (STEP) ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు ఆధ్వర్యంలోఈనెల 30, 31వ తేదీలలో నిర్వహించునున్న ఉచిత వ్యక్తిత్వ వికాస వక్త శిక్షణ తరగతులును సద్వినియోగం చేసుకోవాలని స్టెప్ రాష్ట్ర సమితి సభ్యుడు చౌక్కా సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా నెక్కల్లులోనే ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో నిర్వహించనున్న, శిక్షణ శిబిరంలో పాల్గొనే వారికి రెండు రోజులపాటు ఉచిత శిక్షణ భోజన, వసతితో పాటు సర్టిఫికెట్ , మెటీరియల్, అందజేస్తామన్నారు. స్టేజ్ ఫియర్, బాడీ లాంగ్వేజ్, వాయిస్ మోడిలేసన్, ఆర్ట్ఆఫ్ టెల్లింగ్ తదితర అంశాల్లో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణకు హాజరయ్యే వారు ఈనెల 29న సాయంత్రం కల్లా ధ్యాన మందిరానికి చేరుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9491509440, 8247452174, 9000809409, నంబర్లో సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా కోరారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం : ఎపిఒ

ప్రజాశక్తి - వెల్దుర్తి

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు వెల్దుర్తి ఎపిఒ రాజు నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు ఎకరాలులోపు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలనుకున్న రైతులు సంబంధిత గ్రామాలలో ఫీల్డ్అసిస్టెంట్‌ను లేదా మండల ఎపిఒ కార్యాలయంలో సంప్రదించవచ్చని అన్నారు.

రాయలసీమలో సాంఘిక నాటక రంగానికి గొప్ప వైభవం

- విశ్రాంతి జిల్లా కలెక్టర్ గుమ్మల్ల బలరామయ్య
- ప్రజాశక్తి -కర్నూల్ కల్చరల్

రాయలసీమలో సంఘీక నాటకానికి గొప్ప వైభవం ఉందని కర్నూలు జిల్లా పూర్వ కలెక్టర్ జి.బాలరామయ్య అన్నారు. ఆదివారం రాత్రి కర్నూలు లలిత కళాసమితిలో మల్లాది క్రియేషన్స్ హైదరాబాదు వారి ఆధ్వర్యంలో చీకట్లో చంద్రుడు హాస్య నాటిక ప్రదర్శించారు. ఇందులో మల్లాది భాస్కర్, తేజ ,మూర్తుల మురళీధర్, ఆకెళ్ళ గోపాలకృష్ణ, శ్రీనివాస్ నాయుడు, అర్జున్, జి ఎస్.చలపతి నటుల బృందం నటించారు. ఈ సందర్భంగా బలరామయ్య మాట్లాడుతూ ప్రతినెల చివరి ఆదివారం సాంఘిక నాటకం ప్రదర్శిస్తూ నాటక రంగానికి జీవం పోస్తున్నారన్నారు. పరిషత్ లేకపోయినా చివరి ఆదివారం సాంఘిక నాటకం ప్రదర్శించే ఏకైక కళా సంస్థ ఇదేనన్నారు. ఈ సందర్భంగా ఆయన నటులకు ప్రదర్శన పారితోషకం 20,000 ఇచ్చి దర్శకుడు టి.మురళీధర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరో సర్జన్ డబ్ల్యు సీతారాం జ్యోతి ప్రజ్వలనం చేసి కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఇటీవల తిరుపతి గోవిందరాజు స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శించిన నృత్యాలను నాట్య శిక్షకులు కరీముల్లా శిష్య బృందం ప్రదర్శించారు. కార్యక్రమానికి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య స్వాగతం పలుకుతూ మల్లాది భాస్కర్ బృందం సినిమా టివి, జబర్దస్త్ వంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని కర్నూలుకు రావటం విశేషమని అన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మురళీధర్ మాట్లాడుతూ జబర్దస్త్ టీవీల్లో తాము చేసే ప్రదర్శనలు బొమ్మ వంటివని ప్రేక్షకుల ముందు నటించడం అమ్మ వంటిది అన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు బి ఈశ్వరయ్య, ఇనయతుల్లా, సివిరెడ్డి, సంగా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చీకట్లో చంద్రుడు హాస్య నాటికలో ఓ సన్నివేశం

ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల ఖాతాలో జమ చేయాలి

రైతులకు విత్తనాలు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలి

ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లాలో 2023 ఖరీఫ్ సీజన్లో నష్టపోయిన రైతులకు అందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ రైతులందరికీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం రైతు సంఘం కార్యాలయంలో (కెకెభవన్) రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో రెండు మండలాలను తప్ప అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని, ప్రకటించిన మండలాల్లో ఈనెల 18న కొంతమంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఖాతాల్లో జమ చేశారన్నారు. కరువు మండలాలుగా ఉన్న అనేక మండలాల్లో రైతులకు చాలామందికి ఇప్పటివరకు ఇన్పుట్ సబ్సిడీ జమకాలేదని, తక్షణమే నష్టపోయిన రైతులందరికీ ఇన్పుట్ సబ్సిడీ జమ చేయాలని డిమాండ్ చేశారు. దీనితోపాటు నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం కంపెనీలకు ప్రీమియం చెల్లించిందని, ఏ పంట అయినా నష్టపోతే అటువంటి రైతుకు ఇన్సూరెన్స్ కవర్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2023 ఖరీఫ్‌లో పంటలన్నీ ఎండిపోయి పాసివేసిన పరిస్థితి ఉన్నది. అటువంటి పంటలన్నిటికీ రైతులకు పూర్తిస్థాయి ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. వెంటనే రైతులకు రావలసిన నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం నైరుతి రుతూ పవనాలు వేగవంతంగా కదులుతున్నాయని, వర్షాలు కూడా గత సంవత్సరం కన్నా మెరుగ్గా పడుతున్నాయి. దీనితో రైతాంగం అంతా కూడా భూములను సాగుకు సిద్ధం చేస్తున్నారు. పొలాలకు అవసరమైన విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలు అందించాల్సిన అవసరం ఉన్నదని, కర్నూలు జిల్లాలో 10,53,900 ఎకరాలు సాగు భూమి ఉండగా ప్రధానంగా పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న, మిరప, పొద్దు తిరుగుడు, ఆముదం, ఉల్లి, టమేటా వంటి పంటలు సాగవుతాయని, ప్రభుత్వం ఒక్క వేరుశనగ విత్తనాలు మాత్రం సబ్సిడీకి సిద్ధంగా ఉన్నాయన్నాయని తీసుకోమని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నారన్నారు. ఇది ఏ మాత్రం సమంజసం కాదని, వేరుశనగతో పాటు పత్తి, మొక్కజొన్న, ఆముదము, పొద్దుతిరుగుడు రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు 90శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నకిలీ విత్తనాల నుండి రైతులను కాపాడాలన్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఇప్పటికీ నకిలీ విత్తనాలు రైతులకు అంటగట్టి రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. అటువంటి వారిపై నిఘా పెట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి. హనుమంతు, రంగారెడ్డి , సహాయ కార్యదర్శి కోటకొండసూరి, ఎ.కృష్ణ, జిల్లా నాయకులు జి. ఆంజనేయులు ,శ్రీరాములు, మధుసూదన్ ,సిద్దయ్య గౌడ్, వీరన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ

శివ బైక్‌జోన్ షాప్‌పై సత్యనారాయణరెడ్డి గూండాగిరి

దుకాణం తాళం పగలగొట్టి బోర్డును తగలబెట్టిన వైనం
ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు - స్పందించని పోలీసులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : నగరంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న యూకాన్ షాపిల్లో కప్పట్రాల శివకుమార్ పాత ద్విచక్ర వాహనాల అమ్మకాలు కొనుగోలు చేసేందుకు ఒక దుకాణాన్ని గత పది నెలల క్రితం అద్దెకి తీసుకున్నాడు. అయితే ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో సత్యనారాయణ రెడ్డి మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఇతను తెలియకుండా షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాన్ని ఎవరు అద్దె తీసుకోకూడదు. కప్పట్రాళ్ల శివకుమార్ ఒక దుకాణాన్ని అద్దెకు తీసుకోవడంతో ఆగ్రహం చెందిన సత్యనారాయణ రెడ్డి నాకు తెలియకుండా ఎలా దుకాణం తీసుకుంటావని పది నెలల నుంచి టార్చర్ చేస్తున్నాడని శివకుమార్ విలేకరుల సమావేశంలో వాపోయాడు. ఈనెల 24న తెల్లవారుజామున గొడవపడిన సత్యనారాయణ రెడ్డి దుకాణం వాకిళ్లను పగలగొట్టి దుకాణం నేమ్ బోర్డును కాల్చివేశారని ఆవేదన చెందారు. నా స్నేహితుడు మల్లికార్జునతో పాటు నా మీద 4వ పట్టణ పోలీస్ స్టేషన్లో సత్యనారాయణ రెడ్డి ఫిర్యాదు చేయగా వెంటనే పోలీసులు కేసు నమోదు చేశారని, తాము దుకాణం పగలగొట్టి నేమ్ బోర్డును కాల్చిన అంశంపై సత్యనారాయణ రెడ్డి పై ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవడంలేదని కప్పట్రాళ్ల శివకుమార్ వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి యుకాన్ షాపిలో దాదాగిరి చేస్తున్న సత్యనారాయణ రెడ్డిపై కేసు నమోదు చేసి దుకాణం నిర్వహణదారులకు రక్షణ కల్పించాల్సిందిగా శివకుమార్ కోరారు.



ఎస్ఎస్ ట్యాంక్ నుంచి శుద్ధి చేసిన నీళ్లు సరఫరా చేయాలి

ఎస్ ఎస్ ట్యాంకును పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలం పరిధిలో కుప్పగల్లు ఎస్ఎస్ ట్యాంక్ పరిధిలోని పెద్ద తుంబలం, కుప్పగల్లు, బల్లెకల్లు, పాండవగల్లు, జాలిమంచి, గణేకల్లు, ఇస్వీ గ్రామాలకు శుద్ధిచేసిన మంచినీటిని సరఫరా చేయాలని సిపిఎం ప్రతినిధి బందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా వారు ఎస్ఎస్ ట్యాంకును, మైక్రో


ఎస్ ఎస్ ట్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఫిల్టర్ గదిని గ్యాస్ సిలిండర్‌గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె. లింగన్న మాట్లాడుతూ మైక్రో ఫిల్టర్ గదిలో రెండు సిస్టంలు ఉన్నప్పటికీ అందులో నీళ్లు ఎలాంటి ఫిల్టర్ కావడంలేదని, కేవలం అలంకార ప్రాయంగా మాత్రమే మైక్రో ఫిల్టర్ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు నుండి నేరుగా నీళ్లు పంపింగ్ చేస్తున్నారని దీనివలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆయన తెలిపారు. గతంలో ఎన్నోసార్లు ప్రభుత్వానికి అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ఎలాంటి మార్పు లేదన్నారు. ఇప్పటికైనా మైక్రో ఫిల్టర్ సిస్టంలను రిపేరు చేసి వెంటనే శుద్ధి చేసిన మంచినీళ్లు గ్రామాలకు అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు వీరారెడ్డి మాట్లాడుతూ గ్రామాలకు పంపింగ్ చేసే సమయంలో నీళ్లకు గ్యాస్ వదులుతున్నారని, ఆ గ్యాస్ సిలిండర్ ఎప్పుడు అయిపోతుందో తెలియదని, ఈ మధ్యన ఆ సిలిండర్ అయిపోవడంతో చెరువు నీళ్లు నేరుగా పంపింగ్ చేసి తాగడానికి వదలడం వల్ల ఈ గ్రామాల్లో చాలామంది ప్రజలు దగ్గు, జలుబు, జ్వరం వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడుతున్నారని, వెంటనే గ్యాస్ వదిలిన నీళ్లను సరఫరా చేయాలన్నారు. అదనంగా మరో గ్యాస్ సిలిండర్ స్పేర్ అదనంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ ఏడు గ్రామాలకు ఒకే పైప్ లైన్ ఉండడం వలన 4-5 రోజులకోసారి నీళ్లు సరఫరా అవుతున్నాయని, ఎక్కడైనా పైపు లీకేజీ ఏర్పడితే మరో 4-5 రోజులు సమయం పడుతుందని, అందుకోసం పాండవగల్ గ్రామం వరకు 2వ పైప్ లైన్ వేయాలని డిమాండ్


ఎస్ ఎస్ ట్యాంకును పరిశీలిస్తున్న సిపిఎం బృందం

చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే ఎస్ఎస్ ట్యాంక్ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు రామాంజనేయులు, పాండవగల్ శాఖ కార్యదర్శి గోవిందు, గనేకల్ శాఖ కార్యదర్శి విరుపాక్షి, సిపిఎం నాయకులు హనుమంత రెడ్డి, తాయప్ప, స్థానిక పార్టీ కార్యకర్తలు గోవింద్ రెడ్డి, ఉసేని, ఆంజనేయ, అన్వర్‌బాషా, రవి, కుప్పగల్ హుసేని పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి -చిప్పగిరి



గత కొన్ని మాసాలుగా అనారోగ్యానికి గురయి కోలుకోలేక మాజీ సర్పంచి నెట్టి కంటమ్మ (76) శనివారం రాత్రి మతి చెందారు. చిప్పగిరి మండల పరిధిలోని కుందనగుర్తి గ్రామానికి చెందిన నెట్టి కంటమ్మ 2006 నుండి 2012 వరకు కుందనగుర్తి సర్పంచిగా పని చేశారని, కుందన్ గుర్తి గ్రామ అభివృద్ధి కోసం ఆమె ఎంతో కృషి చేశారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యానికి గురై కోలుకోలేక గత రాత్రి మతి చెందిందని నెట్టికంటమ్మ కుమారుడు పురుషోత్తం తెలిపారు. నెట్టికంటమ్మ మృతికి సంతాపంగా చిప్పగిరి టిడిపి సీనియర్ నాయకులు వన్నాల ఆంజనేయులు, చిప్పగిరి మాజీ సర్పంచి గోవిందన్న ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.


తమిళనాడు రాష్ట్రం అరుణాచలేశ్వరునికి పూజలు చేసిన వైసిపి నాయకులు

యువతలో దేశ భక్తిని పెంచే ప్రయత్నమే యాత్ర లక్ష్యం

కార్గిల్ విజయ కలశ యాత్ర గురించి కెప్టెన్ ఎస్‌వి బండారి

ప్రజాశక్తి-మంత్రాలయం

యువతలో దేశ భక్తిని పెంచే ప్రయత్నంలో భాగంగానే కార్గిల్ విజయం దినం సందర్భంగా 25 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కార్గిల్ విజయ కలశ యాత్రను నిర్వహిస్తున్నట్లు కెప్టెన్ ఎస్‌వి బండారి తెలిపారు. ఆదివారం శ్రీమఠం చేరుకున్న యాత్ర బృందం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులను కలుసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం


జ్ఞాపికను అందజేస్తున్న శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు

బెంగళూరుకు చెందిన సిటిజన్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలకు ధైర్యం చెప్పడంతో పాటు యువతను మేల్కొలుపే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. జనవరి 25న ప్రారంభమైన ఈ యాత్ర 12 రాష్ట్రాల్లో, 25నుంచి 30 పట్టణాల గుండా ప్రయాణం చేస్తుందని, జులై 26న కన్యాకుమారి చేరుకునే విధంగా ప్రణాళిక ఉందని తెలిపారు. అక్కడ డ్రా సెక్టార్ కార్గిల్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్నల్ పివి.హరి ఆదోని అసోసియేషన్ సైనిక్ అధ్యక్షులు రవీంద్రబాబు, కోశాధికారి సూర్యకాంత రెడ్డి, జగన్నాథ్ నాయక్, కృష్ణయ్య, చలపతి, శాంతమూర్తి, మాజీ సైనికులు దినేష్, శివకుమార్, వాసుదేవ్, శేషాద్రి, నారాయణ్, మోహన్, కుమారస్వామి, వీరేంద్ర, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సైనిక కుటుంబాల పరిస్థితిని ప్రధాని దృష్టికి తీసికెళ్తాను

శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు

మంత్రాలయం: కార్గిల్, పుల్వామ దాడుల్లో అసువులు బాసిన అమరవీరుల కుటుంబాల పరిస్థితి గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్తానని శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు పేర్కొన్నారు. ఆదివారం కార్గిల్ విజయ్ దివస్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, సిటిజన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, బెంగళూరు, కార్గిల్ యుద్ధ వీరులకు దేశవ్యాప్తంగా నివాళులర్పించే కార్గిల్ విజయ కలశ యాత్ర మంత్రాలయం చేరుకొని ఆయన ఆశిస్సులు పొందని సందర్భంగా ఆయన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో


మంత్రాలయం చేరుకున్న కార్గిల్ యుద్ధవీరుల శ్రద్ధాసుమన్ కలశయాత్ర బృందానికి స్వాగతం పలికిన పీఠాధిపతులు

పనిచేసి పదవీ విరమణ పొందిన వీర సైనికులు రావడం సంతోషకరం అన్నారు. ఈ సందర్భంగా నంద్యాల నుండి దివంగత మాజీ నాయక్ హన్సర్ హుస్సేన్ షేక్ భార్య ప్రవీణ్ భాను, ఇతర విశ్రాంత సిబ్బందిని ప్రశంసించారు. వారి బాధలు ఆర్థిక కష్టాల గురించి తెలుసుకున్న ఆయన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, రక్షణ మంత్రి దృష్టికి తీసుకువెళ్లడానికి అవసరమైన సహాయం కోరేందుకు తన మద్దతు ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. భారత సైనికుల ధైర్యాన్ని అంకితభావాన్ని కొనియాడారు. మన సాయుధ బలగాలు చేసిన అపారమైన త్యాగాలను ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తూ కార్గిల్ యుద్ధం , పుల్వామా దాడి సమయంలో శ్రీ మఠం నిర్వహించిన సహాయ శిబిరాలు,ఉదారంగా విరాళాలను కూడా చేసినట్లు వివరించారు. శ్రద్ధా సుమన్ కార్గిల్ కలష్ యాత్ర మన దేశాన్ని రక్షించిన వీర సైనికుల పట్ల మన దేశం కృతజ్ఞత , గౌరవానికి ప్రతీక అని ఇది మన దేశ భద్రత కోసం అందించిన వారి సేవలను గుర్తు చేసుకోవడం గర్వంగా ఉందని వారి జ్ఞాపకం, నిబద్ధతతో కూడిన విధులు యవతకు ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే మంత్రి కావాలని పూజలు

ప్రజాశక్తి-మంత్రాలయం

ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి మంత్రి పదవి దక్కాలని కోరుతూ వైసిపి నాయకులు అరుణాచలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం జడ్‌పిటిసి మజ్జిగ గోవిందమ్మ కుమారుడు వైసిపి నాయకులు రోగప్ప, శ్రీనివాసులు తదితరులు తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలేశ్వరున్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కర్నూలు జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో మంత్రాలయం ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి కైవసం చేసుకోబుతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. జూన్ 4న వైసిపి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడమే కాకుండా నియోజకవర్గంలో నాల్గవ సారీ ఎమ్మెల్యేగా వై. బాలనాగిరెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి వైసిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి మంత్రి పదవి వరించేలా చూడాలని కోరుతూ గిరి ప్రదక్షిణలు చేశామన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తారని తెలిపారు.


ఆదివారం మంత్రాలయంలో బక్తులతో కిటకిటలాగుతున్న దృశ్యం

ముందుచూపుతో జీవితంలో రాణింపు

మొలగవల్లిలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - ఆలూరు

విద్యార్థులు జీవితంలో రాణించాలంటే ముందు చూపుతో మెలగాలని రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో నిర్వహించిన 2000-2001 బ్యాచ్ విద్యార్థులు నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు సుధాకర్, బాలరాజు, రేఖా, పార్వతిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. మీ పిల్లల భవిష్యత్తు కోసం కొంచెం నిధిని పొదుపు చేసుకోవాలని వారిని సెల్, టివిలకు దూరంగా ఉంచాలని అన్నారు. చాలా మంది మేము పాఠాలు నేర్పిన విద్యార్థులు ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉండి ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కన్నతల్లి లాంటి జన్మభూమిని, పాఠశాలను మరవరాదని మీకు తోచిన సహాయం పాఠశాలకు కూడా అందించాలని అన్నారు. గతంలో పోన్‌లు వుండేవి కావని ఇప్పుడు పోన్‌లు ఉన్నాయని స్నేహితులు ఎప్పుడూ అందుబాటులో ఉండి ఒకరికొకరు సమాచారం, సహకారం అందించుకోవాలని అన్నారు. పేదవారు చదవడానికి సహకారం మిత్రులు అందించాలని అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థి కాకా రమేష్ కూతురు నవ్యశ్రీ భరతనాట్యంతో అధ్యాపకులను, విద్యార్థులను అలరించింది. కార్యక్రమం ముగింపులో అధ్యాపకులను విద్యార్థులు పూలమాలలు వేసి బహుమతులతో సత్కరించారు. మాజీ సర్పంచి రంగస్వామి, విద్యాకమిటి చైర్మన్ రామాంజినేయులును కూడా విద్యార్థులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు షఫీ, సుధాకర్, సాయి, సోము యాదవ్, రాధిక, యశోద,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైటైర్డ్ తెలుగు అధ్యాపకులు ఆంజనేయులు

శ్రీ మఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి శ్రీ మఠం చేరుకున్న భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. సెలవు రోజులు కావడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించారు.



రెండు వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-ఆదోని

నాటు సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ డిఎస్పి వి.ధీరాజ్, వన్ టౌన్ సిఐ తేజ హెచ్చరించారు. ఆదోని పట్టణ శివారులోని రణమండల కొండల్లో కార్డెన్ సర్చ్‌లో భాగంగా ఆదివారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి స్థావరంలోని నాటసారా తయారీకి ఉపయోగించిన సామాగ్రిని ధ్వంసం చేశారు. ఆదోని ట్రైనీ డిఎస్‌పి వి.ధీరజ్, వన్ టౌన్ సిఐ తేజ మాట్లాడారు. ఆదోని డిఎస్‌పి శివ నారాయణ స్వామి ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో 2వేల లీటర్ల బెల్లం ఊట, ఉపయోగించిన సామాగ్రిని ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. 20 లీటర్ల నాటుసారాస్వాధీనంచేసుకున్నామన్నారు.దాడుల్లోపోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనే లక్ష్యం

ప్రజాశక్తి-ఆదోని : క్రమశిక్షణతో కూడిన విద్యా బోధనే లక్ష్యంగా చేసుకొని ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని సాయి భారతి పాఠశాల కరస్పాండెంట్ దుర్గేష్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌కెడి కాలనీ, 4వ రోడ్డు, పిరమిడ్ ధ్యాన మందిరం ప్రక్కన స్థాపించిన పాఠశాలలో నర్సరీ నుండి 10వ తరగతి వరకు కొనసాగిస్తున్నామన్నారు.

మాప్రత్యేకతలు: అనుభవం, అంకితభావం, బిఇడి, టిటిసి వంటి అర్హత కలిగిన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన. విద్యార్థులకు ఆడియో విజువల్స్ (టివి) ప్రోగ్రాం ద్వారా రైమ్స్, పాఠాలు బోధించడం. విద్యార్థులపై మానసిక ఒత్తిడి తగ్గించుటకు యోగ, మెడిటేషన్ క్లాసులు నిర్వహించడం. కార్పోరేట్ విద్యా సంస్థలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించడం, అతి తక్కువ ఫీజుతో ఉత్తమ విద్యను అందించడం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించడం. ప్రతి తరగతికి కంప్యూటర్ క్లాసులతోపాటు కంప్యూటర్ ల్యాబ్ శిక్షణ. విద్యార్థుల శారీరక ఎదుగుదలకు తోడ్పాటును ఇచ్చే క్రీడలు నిర్వహించడం. డాన్స్, మ్యూజిక్, కరాటె



పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు శిక్షణ ఇప్పించడం. చిన్నారుల సున్నిత మనస్తత్వాన్ని బట్టి మాతృప్రేమతో కూడిన జాగ్రత్త వహించడం. ఐఐటి ఫౌండేషన్, హ్యాండ్ రైటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, నవోదయ ఎంట్రెన్స్ కొరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


పల్లకి మోస్తున్న శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు

స్వర్ణ పల్లకోత్సవంలో మేనేజర్ కుటుంబం

ప్రజాశక్తి- మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో నిర్వహించిన రాఘవేంద్రస్వామి స్వర్ణ పల్లకోత్సవంలో శ్రీ మఠం మేనేజర్ ఎస్‌కె శ్రీనివాసరావు తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని పల్లకి మోశారు. వేసవి సెలవులు కావడంతో ఆయన కుమారులు, కూతుళ్లు, కోడళ్ళు, మనవళ్ళు, మనమరాళ్ళతో కలసి రాఘవేంద్రునికి స్వర్ణ పల్లకీ సేవ చేయించారు. భక్తుల తరహాలో పూజలో పాల్గొని మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ సాగిన స్వర్ణ పల్లకోత్సవంలో సామాన్య భక్తులుగా పాల్గొని పల్లకీ మోసి తన భక్తిని చాటుకున్నారు.

యనగండ్లలో పారిశుధ్య లోపం

సి బెళగల్ : యనగండ్లబిసి కాలనీలో పారిశుధ్య లోపం తాండవిస్తోంది. మారెమ్మ గుడి దగ్గర నుండి సుంకులమ్మ గుడి వరకు సిసి రోడ్డు ఉన్నప్పటికీ ఇరు వైపులా కాల్వలు లేక మురుగు రోడ్ల మీదే ప్రవహిస్తోంది. అడుగు తీసి అడుగు పెడితేనే ఇళ్లకు చేరుకోవడం ఇళ్లలోకి బురద చేరుతోంది. అక్కడే బురదలో పందులు పొర్లుతు ఇళ్లలోకి చేరుతుండగా బేంబేలెత్తిపోతున్నారు.అధికారుల చర్యలు మాత్రం శూన్యంగా మారాయి.



ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అనాథలకు, వృద్ధులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేముగడ్డ విశాల్ పుట్టినరోజు సందర్భంగా నగరంలోని స్థానిక నిరాశ్రయ గహంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కె బలరాం, గౌరవ అధ్యక్షుడు పద్మా నంద యోగీ, లొద్దిపల్లె హుస్సేన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

డాబాల్లో ఫుల్‌గా లిక్కర్ డ్రింకింగ్

పట్టించుకోని పోలీసులు

ప్రజాశక్తి-ఆదోని

అనధికారికంగా డాబాల్లో లిక్కర్ డ్రింకింగ్ సౌకర్యం కలిపిస్తున్నారు. సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా ఉంటుందని యూత్ మద్యం తీసుకువెళ్లి దాబాల్లో ఫుల్లుగా తాగేస్తున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన పోలీసు అధికారులు చూసి చూడనట్లు వ్యహరించడం వల్ల రోజురోజుకు మద్యం తాగే వారి సంఖ్య పెరుగుతూనే ఉందని పలువురు చెబుతున్నారు. ఆదోని పట్టణం శివారులో ఆలూరు రోడ్డు, ఆస్పరి రోడ్డు ఎమ్మిగనూరు రోడ్డు, మాధవరం రోడ్డు ప్రాంతాలలో యథేచ్ఛగా అనాధికారికంగా రోడ్డు పక్క వెలిసిన డాబా,హోటళ్లలో మద్యం తాగేందుకు నిర్వాహకులు సదుపాయాలు కల్పిస్తున్నారని పలువురు చెబుతున్నారు. దాబాల్లో మాంసాహారం ఉండడం వల్ల అక్కడ మద్యం తాగినందుకు వెళ్తున్నారు. ఇదే అదునుగా కలెక్షన్ రాబట్టేందుకు నిర్వాహకులు మద్యం సేవించే సదుపాయం కల్పించడం వల్ల వారి వ్యాపారం రోజురోజుకు పుంజుకుంటుందనే ఆశతో వ్యవహారానికి తెర లేపారు.

తెలంగాణ మద్యం ఫుల్ : ఆదోని పట్టణంలో తెలంగాణ మద్యం గల్లిగల్లిలో దొరుకుతుందని వాటిని అమ్మేవారు చేతినిండా డబ్బులు సంపాదిస్తున్నారని సమాచారం ఉంది. ప్రభుత్వం నిర్వహించే మద్యం దుకాణాలలో బ్రాండెడ్ దొరకడం లేదని కొందరు తెలంగాణ నుండి ఫుల్ బాటిల్స్ తెప్పిస్తూ ఫోన్ కొడితే చాలు ఉన్నచోటకే మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతా తెలిసినా సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టని విధంగా వ్యవహరించడంలో అంతర్యమేమిటని పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో కొందరికి ముడుపులు ముడుతున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు నిగా ఉంచాలని కోరుతున్నారు.

వెలవెలబోతున్న బార్లు : ఆదోని పట్టణంలో ప్రభుత్వ అనుమతి పొందిన ఐదు బార్లు ఉన్నాయి. బార్లలో మద్యం ధరలో వ్యత్యాసం ఉండడం వల్ల అక్కడికి వెళ్లలేక తెలంగాణ కర్ణాటక మద్యం తీసుకొని డాబాల్లో సేవిస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఏడాదికి రూ.60 లక్షల నుండి రూ.70 లక్షల వరకు ప్రభుత్వానికి లైసెన్స్ ఫీజు చెల్లిస్తున్నామని బార్ల నిర్వహణ కష్టతరంగా మారిందని నిర్వాహకులు చెబుతున్నారు. లక్షల రూపాయలు డిపాజిట్ల ఫీజు చెల్లించి దక్కించుకున్నామని, బార్లలో సరైన వ్యాపారం కావడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో బార్లు ఎలా కొనసాగేది అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కర్ణాటక తెలంగాణ మద్యం రవాణాపై నిఘా, అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రభుత్వ ఆదాయం పెరిగేలా చూడాలని కోరుతున్నారు.

డిఎస్‌పి వివరణ: అనధికారికంగా డాబాల్లో మద్యం సేవించేలా ఏర్పాటు చేస్తే సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఆదోని డిఎస్‌పి శివ నారాయణస్వామి బుధవారం తెలిపారు.ఆయన మాటల్లో... కర్ణాటక తెలంగాణ మద్యం రవాణాపై ప్రత్యేకంగా నిఘ ఉంచాం. రాత్రి వేళల్లో వాహనాలు తనిఖీ ముమ్మరం చేశాం. ఇప్పటికే అక్రమంగా మద్యం అమ్మేతే చర్యలు తీసుకుంటుకున్నాం. స్టేషన్ల వారిగా సమీక్ష నిర్వహించి మరింత నిఘా పెంచేలా జాగ్రత్తలు తీసుకుంటాం.



హాలహర్వి గ్రామంలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-నందవరం

ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు రూరల్ సిఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు నందవరం ఎస్‌ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు రూరల్ ఎస్‌ఐ శరత్ కుమార్ రెడ్డితో కలిసి కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనుమానితుల ఇళ్లను సోదా చేశామని, అల్లర్లు జరగకుండా ముందస్తుగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించి హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడే సమయంలో గ్రామంలో గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఫలితల అనంతరం కూడా గొడవలకు పాల్పడకూడదన్నారు. ఫలితాల తర్వాత గ్రామంలో పార్టీలకతీతంగా అందరు ప్రశాంతం వాతావరణంలో జీవించాలన్నారు.

పోటో : సామాగ్రిని ధ్వంసం చేసిన పోలీసులు